క్లుప్తంగా

ఆంజనేయరాజుకు జీవిత సాఫల్య పురస్కారం

అద్దంకి: ప్రముఖ రంగస్థల నటుడు హరిశ్చంద్ర పాత్రధారి పట్టణానికి చెందిన మిద్దెబోయిన ఆంజనేయరాజు జీవిత సాఫల్య పురస్కారం అందుకోనున్నారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 10న పుట్టంరాజు బుల్లెయ్య రామలక్ష్మమ్మ ట్రస్ట్ తరుపున అందిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మారంవారి సేవాదన్‌లో నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

పర్చూరు (చినగంజాం): పర్చూరు ఎక్సైజ్ పరిధిలో ఉన్న మండలాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ భుజంగరావు హెచ్చరించారు. శుక్రవారం ఇంకొల్లు మండలం, ఇడుపులపాడు గ్రామంలో అక్రమంగా ఆరు మద్యం బాటిళ్లను కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చెసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపులు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని అన్నారు. ఎమ్మార్పీ ధరకు మించి మద్యం విక్రయిస్తే అలాంటి షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ



గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

చినగంజాం: గ్రామాల్లో సత్వర అభివృద్ధి సాధించేందుకు ఉపాధి హామీ పనులు ఎంతగానో ఉపయోగ పడతాయని ఉపాధి హామీ ఏపీఓ జే లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం ఉపాధి హామీ పథకంలో భాగంగా 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనులు గుర్తింపు, నిర్వాహణపై మండలంలోని పెదగంజాం, రాజుబంగారుపాలెం, పల్లెపాలెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి తయారు చేసిన జాబితాను గ్రామ సభలలో చదివి వినిపించారు. గ్రామ సభల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మాల మహానాడు, సభ ప్రతినిధుల సమావేశం

చీరాల రూరల్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు, మాల మహాసభల ప్రతినిధుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అధిక సంఖ్యలో ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారని తెలిపారు.

దేవస్థానానికి కంప్యూటర్, ప్రింటర్ అందజేత



ఏసీకి కంప్యూటర్, ప్రింటర్ అందజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

అద్దంకి రూరల్: బ్యాంకు ఉద్యోగులు శుక్రవారం ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానానికి కంప్యూటర్, ప్రింటర్‌లను దేవస్థాన ఏసీ ఎం తిమ్మనాయుడికి అందజేశారు. దేవస్థాన అభివృద్ధికి సహకారం అందించిన దాతలు యూనియన్ బ్యాంకు ఒంగోలు రీజనల్ హెడ్ రవికుమార్, అద్దంకి యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలాజీలను దేవస్థాన ఏసీ అభినందించారు.

నేటి నుంచి బ్రహ్మంగారి మఠానికి బస్సు



బ్రహ్మంగారి మఠం బస్సు నంబర్ ప్లేట్

అద్దంకి రూరల్: కార్తీకమాసం సందర్భంగా అద్దంకి డిపో బ్రహ్మంగారి మఠానికి నూతనంగా శనివారం నుంచి ఎక్స్‌ప్రెస్ సర్వీసు ప్రారంభించనున్నట్లు అద్దంకి డిపో మేనేజర్ బెల్లం రామ్మోహనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి ముండ్లమూరు, దర్శి, పొదిలి, బేస్తవారిపేట, పోరుమామిళ్ల మీదుగా బ్రహ్మంగారి మఠం 11 గంటలకు చేరుతుందని, మళ్లీ మధ్యాహ్నం 12 గంటలకు బ్రహ్మంగారి మఠం నుంచి బయలుదేరి సాయంత్రం 5.45 గంటలకు అద్దంకి చేరుతుందని తెలిపారు. సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

బిల్లులు ఇవ్వరు.. రోడ్డు వేయరు



ఇంకొల్లు- పర్చూరు వద్ద సమస్యగా ఉన్న కల్వర్టు (ఫైల్)



రాకపోకలకు అంతరాయంగా ఉన్న కప్ప వాగు

- పాత మద్రాస్ రోడ్డుకు ఎన్నాళ్లీ దుస్థితి ?
- ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు ఆగిన రోడ్డు నిర్మాణాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

పర్చూరు (చినగంజాం): ఒకప్పుడు ఎంతో వైభవంగా వెలుగొంది వ్యాపార, వాణిజ్య అవసరాలకు ప్రజల అవసరాలకు ఎంతగానో ఉపయోగపడిన రోడ్డు మార్గం ప్రస్తుతం అభివృద్ధికి నోచుకోక శాపగ్రస్తురాలిగా కునారిల్లుతోంది. గుంటూరు నుంచి మద్రాస్ వరకు గతంలో ఎంతగానో రవణా సౌకర్యాన్ని అందించిన మద్రాస్ రోడ్డు మార్గం ప్రస్తుతం హైవే రాకతో రూపుకోల్పోయింది. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈ మార్గం ప్రజల ప్రాంతీయ అవసరాలకు సైతం తీర్చక లేక దుస్థితిలో కొనసాగుతోంది. రోడ్లు, భవనాల శాఖల పరిధిలోని పాత మద్రాసు రోడ్డు గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలను కలుపుతూ ఉండేది. ఈ మార్గం గుండా ప్రయాణమంటే ద్విచక్ర వాహనదారులు మొదలు కొని, ఆర్టీసీ ప్రయాణికులు, ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగులు పొంగి పొర్లుతుండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతున్నాయి.

కూటమి ప్రభుత్వంలో బిల్లుల పెండింగ్..

ఇంకొల్లు సినిమా హాలు సెంటర్ నుంచి పర్చూరు బొమ్మల సెంటర్ వరకు గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి రూ. 22 కోట్లు మంజూరైంది. అప్పటి ప్రజాప్రతినిధులు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు టెండర్‌ను పిలిచి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. రోడ్డు పనులను లాంఛనంగా ప్రారంభించిన కాంట్రాక్టర్ ఇంకొల్లు సినిమా హాలు సెంటర్ నుంచి వై జంక్షన్ వరకు ఉన్న సీసీ రోడ్డును మాత్రమే పూర్తి చేసి చేతులు దులుపుకున్నాడే తప్ప ముందుకు కదలలేదు. వై జంక్షన్ నుంచి వంకాయలపాడు గ్రామం వరకు ఉన్న 9 కి.మీ రోడ్డును అభివృద్ధి చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో పనులు ఆగిపోయాయి. కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఈ రహదారిలో నాగార్జున సాగర్ ఆయకట్టు కాలువలపై కల్వర్టుల నిర్మాణం, దగ్గుబాడు వద్ద హై కల్వర్టు నిర్మాణం, వంకాయలపాడు వద్ద కల్వర్టు నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి కాంట్రాక్టరుకు సుమారు రూ.4 కోట్ల మేర బకాయి ఉండటంతో ఆ నగదును నేటి వరకు ప్రభుత్వం చెల్లించక పోవడంతో పనులు నిలిపివేశాడు.

రహదారి నిర్మాణానికి అన్నీ అడ్డంకులే..

రహదారి నిర్మాణానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్ చేసిన పనులకు బిల్లులు రాలేదంటూ నిర్మాణాలు అర్ధంతరంగా నిలిపివేయగా రహదారి వెంట చెట్ల తొలగింపు మరో అడ్డంకిగా మారింది. ఇంకొల్లు నుంచి పర్చూరు వరకు రోడ్డుకు రెండు వైపులా ఉన్న భారీ చెట్ల తొలగింపునకు సంబంధించి ప్రభుత్వం రూ.3 లక్షలకు టెండర్ పిలిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చెట్లను సగం మాత్రమే నరికించి కాండం మొదళ్లను మాత్రం అలాగే వదిలిపెట్టి వెళ్లిపోయాడు. దాంతో రహదారి అభివృద్ధికి భారీ చెట్ల కాండాలు మరో అడ్డంకిగా మారింది.

ప్రజా ప్రతినిధులు కృషిచేయాలి..

దుస్థితిలో కొనసాగుతున్న పాత మద్రాస్ రోడ్డుపై ప్రయాణమంటేనే వాహనదారులకు నరక ప్రాయంగా మారింది. పూర్తి స్థాయిలో రోడ్లు మరమ్మతులు చేస్తే పర్చూరు నుంచి ఇంకొల్లు మండలంలోని పదుల సంఖ్యలో నెలకొన్న వేలాది మంది ప్రజలకు, ఈ మార్గం గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులకు ఉపశమనం కలుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం పర్చూరు ఇంకొల్లు పాత మద్రాసు రోడ్డును ప్రమాదకరమైన మలుపులు తొలగించి రోడ్డు నిర్మాణం ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

> **నిధులు మంజూరు కాలేదు.**
> కాంట్రాక్టర్లకు బకాయి ఉన్న డబ్బులు పడక పోవడంతో పనులు మొదలు పెట్టలేదు. ఇంకొల్లు మండలానికి సంబంధించి కనీసం మరమ్మతులకు కూడా నిధులు మంజూరు కాలేదు. త్వరగా నిధులు వస్తే పనులు చేయిస్తాం.
> – శ్రీకాంత్, జేఈ, ఆర్అండ్ బీ

సమర్థవంతంగా నైపుణ్య గణన



నైపుణ్య గణనపై సూచనలందిస్తున్న ఎంపీడీవో శివసుబ్రమణ్యం

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రారంభించనున్న ఇంటింటా నైపుణ్య గణనను సచివాలయ ఉద్యోగులు అందరు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ హాలులో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్న 22 గ్రామ సచివాలయాల అన్నీ విభాగాల ఉద్యోగులతో నైపుణ్య గణనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయితీల్లోని 29000 నివాస గృహాలు ఉన్నాయని వీటిలో నివాసం ఉంటున్న ప్రతి కుటుంబంలో చదువుకున్న వారి వివరాలు, చేస్తున్న వృత్తి, వృత్తి నైపుణ్యాన్ని పెంచే కోర్సులు, వృత్తివిద్యా కోర్సులు, ప్రతి ఒక్కరి వివరాలు సేకరించాలన్నారు. వచ్చే వారంలో ప్రారంభించనున్న స్కిల్ సెన్సెస్ సర్వేలో అన్నీ విభాగాల సచివాలయాల ఉద్యోగులు అందరు పాల్గొని అన్నీ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో శిక్షకుడు రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మన బాధ్యత

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యురాలు పద్మావతి

ఇంకొల్లు (చినగంజాం): ఉపాధ్యాయులు జవాబుదారీతనంతో పనిచేసి బాలల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. శుక్రవారం ఇంకొల్లు మండలంలో ఉన్నత పాఠశాలను, పలు అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్ బాలిక పాఠశాల విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యార్థినులు బాగా చదవుకుని ఉన్నతస్థితికి రావాలని సూచించారు. తప్పని సరిగా బాలికలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

ఇన్‌చార్జి హెచ్ఎంపై ఆగ్రహం..

అంతకుముందు జెడ్పీ ప్రైమరీ స్కూలును ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతి గదులు శుభ్రంగా లేవని, బూజు పట్టి ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదుల బాక్స్ ఎందుకు మూలన పెట్టారని ఆమె ప్రశ్నించారు. స్కూలుకి సంబంధం లేని వ్యక్తులు స్కూల్ ఆవరణలో అధిక శబ్దంతో మొబైల్ ఫోన్లలో పాటలు పెడుతున్నారని ఇన్‌చార్జి హెచ్ఎం శాంతిప్రియపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం తనిఖీ చేయగా నాణ్యతగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జడ్పీహెచ్ హైస్కూల్‌ను కూడా ఆకస్మిక తనిఖీ చేశారు. స్కూల్ రికార్డుల్లో అధిక మొత్తంలో డ్రాప్‌ఔట్ విద్యార్థులను గుర్తించారు. డ్రాపఔట్ విద్యార్థుల సమాచారం అడగ్గా ఎటువంటి రికార్డ్స్ లేవని, సీఆర్పీ విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరిని చూపుతుందని గుర్తించారు. సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ పనితీరు సరిగా లేనందువలన సీఆర్పీకి, సెక్రటరికి మోమోలు జారీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీడీపీవో ఝాన్సీ, సీడబ్ల్యూసీ మెంబెర్ నీలిమ, డీసీపీ ఓ పురుషోత్తం రావు, సీఐ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కోటి సోమవారం సకల శుభకరం



భక్తులు, పర్యాటకులతో ఆహ్లాదంగా ఉన్న వాడరేవు తీరం



పేరాలలో ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి

- తీరంలో కోటి సోమవారం సందడి
- ప్రత్యేక పూజలు చేసిన మహిళలు

చీరల టౌన్/చీరాల అర్బన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం వాడరేవు తీరంలో కోటి సోమవారం సందడి నెలకొంది. సుదూర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు వాడరేవుకు చేరుకుని సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించారు. తీరానికి చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలతో పాటుగా పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు అధికంగా వచ్చారు. వాడరేవుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చి ఆనందరంగా తీరంలో గడపడంతో వాడరేవులో సందడి నెలకొంది. అనంతరం తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామితో పాటుగా రామాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

తీరప్రాంతంలో గట్టి బందోబస్తు..

కార్తిక మాసాన్ని పురస్కరించుకుని వాడరేవు సముద్ర తీరప్రాంతానికి వచ్చే భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రూరల్ ఎస్సై అంబటి చంద్రశేఖర్ తెలిపారు. వాడరేవు గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్ పోస్టుకు కేటాయించిన సిబ్బందికి పలు సూచనలు అందించారు.

▪ పేరాలలోని గంగా భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి ఆలయంలో కోటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. సప్తమి శ్రవణా నక్షత్రం రెండు కలిపి ఒకే రోజు రావడం కోటి సోమవారం అని, ఉపవాస దీక్షలు ఆచరించి 365 ఒత్తులతో దీపాలు వెలిగిస్తే ఏడాది పాటు స్వామివారిని పూజించిన ఫలితం దక్కుతుందని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, కార్తిక మాసం, ధనిష్ట నక్షత్రం, చతర్ధశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్ర ప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

14 నుంచి క్యాన్సర్‌పై ఇంటింటి సర్వే



క్యాన్సర్ స్క్రీనింగ్‌పై శిక్షణనిస్తున్న డాక్టర్ షాలినీ

స్వర్ణ (కారంచేడు): ఈనెల 14వ తేదీ నుంచి పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయాల్సి ఉందని స్వర్ణ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలినీ అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె క్యాన్సర్ స్క్రీనింగ్‌పై సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఈ స్క్రీనింగ్ చేయాల్సి ఉందన్నారు. స్క్రీనింగ్ సమయంలో వ్యాధి లక్షణాలను సిబ్బంది గమనిస్తే వెంటనే పీహెచ్‌సీకి పంపించాలన్నారు. పీహెచ్‌సీకి వచ్చిన వారికి వైద్యులు అవసరమైన పరీక్షలు చేస్తారన్నారు. పరీక్షల అనంతరం వ్యాధి లక్షణాలను గమనించినట్లయితే అవసరమైన ఆసుపత్రికి రిఫర్ చేస్తారన్నారు. ఈ విధంగా పీహెచ్‌సీ పరిధిలో ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది వెళ్లాలన్నారు. స్క్రీనింగ్ విషయంలో ఎవరూ అలసత్వంగా ఉండవద్దన్నారు. చాలా పటిష్ఠంగా నిర్వహించే ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈఓ వీ నాగేశ్వరరావు, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎల్‌టీ బయ్యా శంకర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పుణ్యప్రదం కార్తీక దీపం



కార్తీక దీపారాధనలు చేస్తున్న భక్తులు



విద్యుత్ దీపాలతో అలకరించిన శివాలయం

- వత్రాలు, నోములకు ప్రాధాన్యం
- ఈనెల శివకేశవులిద్దరికీ ప్రీతికం

వేటపాలెం: కార్తీక మాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో ఉండడంతో ఈనెలకు ఆపేరు వచ్చింది. ఈనెల శివకేశవులిద్దరికీ ప్రీతికరం. ఈ నేపథ్యం లో ఊరూరా వీధివీధినా హరిహర నామస్మరణతో మార్మోగుతున్నాయి. రాత్రి వేళల్లో దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎంతో పవిత్రంగా భావించే కార్తీక మాసం వచ్చే నెల 1వ తేదీ వరకు కొనసాగనుంది. శైవ, వైష్ణవ క్షేత్రాలు భక్తుల సందడితో కిటకిటలాడుతున్నాయి. శివాలయాల్లో కార్తీక పూజలు విశేషంగా జరగుతున్నాయి. ముఖ్యంగా కార్తిక సోమవారాల్లో ఆలయాల భక్తులతో కళకళలాడుతుంటాయి. ఆలయాలను రంగురంగు విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

కార్తీక స్నానం..

కార్తీక మాసమంతా తెల్లవారుజామునే లేచి సముద్రం, నది, చెరువు, కాలువల్లో కానీ ఈ వనరులు అందుబాటులో లేకుంటే ఇంట్లో కానీ తలస్నానం చేయాలి. అప్పుడే దాన్ని కార్తిక స్నానం అవుతుంది. ఈ నియమాలతో స్నానం చేసి, శివుడు, విష్ణువు, మరే దేవున్ని అయితే ధ్యానించి, అంజం ఇవ్వడంతో గంగా నది, పుష్కర తీర్థాల్లో స్నానం చేసిన ఫలితం దక్కుతుందని పురాణాలు చెప్తున్నాయి. అన్ని నదులు కలిసే సముద్రంలో కార్తీక పౌర్ణమి రోజున స్నానాలు ఆచరించిన వారికి సర్వ పాపాలు తొలుగుతాయని భక్తుల నమ్మకం.

దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత..

భారతీయ సంస్కృతిలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. కార్తిక మాసంలో దీపారాదనకే ప్రథమ స్థానం. అందుకే ఇంట్లోకానీ, శివాలయంలో కానీ ఉదయం, సాయంకాలం దీపారాధన చేస్తారు. ఎవరైనా తెలిసికానీ, తెలియకుండా కానీ ఎక్కడైనా సరే దీపం పెడితే వారి పాపాలు హరిస్తాయని పురాణాలు తెలుపుతున్నాయి. దీపం, బంగారం, నవధాన్యాలు, అన్నదానం చేస్తే స్త్రీలకు సౌభాగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. అందుకే దీపారాధనతో పాటు శివుడికి ప్రత్యేకంగా రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అమ్మవారికి లక్షకుంకు మార్చన జరిపిస్తారు. ఆలయాల్లో ప్రత్యేకంగా అర్చకులకు వివిధ రకాల దానాలు చేస్తారు.

కార్తీక వన భోజనం..

ప్రకృతి ఒడిలో సేదతీరుతూ ఆప్యాయతలను పంచుకునే సందర్భం వన భోజనం కార్తీక మాసం ప్రత్యేకం. ఐక్యత సాధనకు ఇది ఎంతో ఉపకరణం, కలిసిమెలిసి మసలుకునే తత్త్వం వనభోజన సంబరాలతో అలవడుతుంది. కార్యక్రమం వనాలపై మన బాధ్యతను గుర్తు చేస్తుంది. ఈ భోజన సంబరంలో పూర్తిగా సాత్విక వంటకాలనే భుజిస్తారు.

కార్తీక స్నానాలకు ఏర్పాట్లు పూర్తి..

సముద్రతీర ప్రాంతాలైన రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం సముద్ర తీరాల్లో పర్యాటకులు, భక్తులు సముద్రస్నానాలు సుదూర ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో వస్తుంటారు. వీరికి అనుగునంగా పంచాయతీ, పోలీసు అధికారులు పర్యాటకుల స్నానాలు ఆచరించి దుస్తులు మార్చుకోవడనాకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గజ ఈతగాళ్లను సముద్ర తీరాన ఏర్పాటు చేశారు.



సముద్ర తీరం వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ఎస్పై పోలీసులు (ఫైల్)

కార్మికుల భద్రతకు ప్రాధాన్యత తప్పనిసరి



హనుమాన్ ఎక్స్‌పోర్ట్స్‌లో క్వారీ మ్యాప్ పరిశీలిస్తున్న టీమ్

బల్లికురవ: గనుల్లో పనిచేసే కార్మికుల భద్రతలకు యజమానులు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని.. అప్పుడే ప్రమాదాలకు పూర్తిగా చెక్ పెట్టవచ్చని ప్రకాశం, బాపట్ల పల్నాడు జిల్లాల మైన్స్ టీమ్ సభ్యులు బ్రహ్మారెడ్డి, నాగావలి అన్నారు. శుక్రవారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ ఎస్‌వీఆర్, అంకమ్మ చౌదరి, సామ్రాజ్యం, హనుమాన్ ఎక్స్‌పోర్ట్స్‌లను బృంద సభ్యులు పరిశీలించారు. భద్రతకు సంబంధించి ఆయా క్వారీలో జెండాల ఆవిష్కరణతో కార్మికులకు అవగాహన కల్పించారు. రికార్డులు, హద్దులకు సంబంధించిన మ్యాపు పనులు చేసే ప్రదేశాన్ని నిశితంగా పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేశారు. భద్రతా చర్యలు, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలు సంభవించని క్వారీలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హనుమాన్ ఎక్స్‌పోర్ట్స్ నిర్వాహకుడు పీ. వెంకటరావు, మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చీరాల డీఎస్పీగా ఎండీ మోయిన్

చీరాల: చీరాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా ఎండీ మోయిన్ నియమితులయ్యారు. ప్రస్తుతం బాపట్ల సీసీఎస్‌లో డీఎస్పీగా ఉన్న జగదీష్ నాయక్ చీరాల డీఎస్పీగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డీజీపీ కార్యాలయంలో అటాచ్‌మెంట్‌లో ఉండి విధులు నిర్వహిస్తున్న ఎండీ మోయిన్ బదిలీపై చీరాల డీఎస్పీగా రానున్నారు.

విద్య మానవుడికి మూడో నేత్రం

బల్లికురవ: విద్య మానవుడికి మూడో నేత్రమని.. ప్రతి ఒక్కరూ చదువుకుని విద్యావంతులు కావాలని ఎంఈవో-2 కె. రమేష్‌బాబు కోరారు. శుక్రవారం స్థానిక మహిళ సమాఖ్య కార్యాలయంలో ఉల్లాస్ ప్రోగ్రాం సంబంధించి ఎంపిక చేసిన 72 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. 15 నుంచి 70 సంవత్సరాల్లోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. 100 రోజుల్లో ఎంపిక చేసిన 720 మంది నిరక్షరాస్యులను సంతకం చేయటం, పుస్తకాలు చదవటం నేర్పించాలని ఎంఈవో కోరారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారావు, సీసీ పేరయ్య, సిబ్బంది అంజయ్య, అంకిత మల్లేశ్వరీ, మండల సమాఖ్య అధ్యక్షురాలు రమాదేవి పాల్గొని మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: వేటపాలెం మండలం రూరల్‌లోని చల్లారెడ్డిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తారని రూరల్ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కాయిపాలెం, కొత్తపాలెం, లక్ష్మీపురం, కఠారివారిపాలెం, బచ్చుల వారిపాలెం, ఊటుకూరి సుబ్బయ్యపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెం, గ్రామాల పరిధిలోని విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.